**Eenadu**

# ఒక్కో కానిస్టేబుల్ పోస్టుకు 126 మంది పోటీ

**ఈనాడు–అమరావతి:** ఏపీ పోలీసు కానిస్టేబుల్ (కమ్యూనికేషన్స్) ఉద్యోగాలకు తీవ్ర పోటీ నెలకొంది. ఒక్కో ఉద్యోగానికి సగటున 126 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అక్టోబరు 1 సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయ్యే సమయానికి 62,319 దరఖాస్తులు వచ్చాయి. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఇంటర్, డిప్లొమా విద్యార్హత అయినప్పటికీ దరాఖాస్తుచేసినవారిలో డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు దాదాపు 48 శాతం మంది ఉన్నారు. పీజీ అర్హత కలిగినవారు 2,280 మంది, డిగ్రీ పూర్తిచేసినవారి సంఖ్య 27,550. ఇందులో 4,659 మంది సంప్రదాయ డిగ్రీ కాకుండా ఇంజినీరింగ్, ఇతర వృత్తివిద్యా కోర్సులు చేసినవారు ఉండటం గమనార్హం.

దరఖాస్తుల గడువు పూర్తికావడంతో అక్టోబరు 20 నుంచి శారీరక దారుఢ్య, సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పోలీసుశాఖ ప్రకటించింది.కాల్ లెటర్లను recruitment.appolice.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్ సింగ్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. అభ్యర్థులు తమ కాల్‌లెటర్లను శారీరక దారుఢ్య, సామర్థ్య పరీక్షకు 10 రోజుల ముందుగా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పోలీసుశాఖ పేర్కొంది. ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు చేసిన అభ్యర్థులు ఈ విషయాన్ని ఈమెయిల్ ద్వారా apslprb.pc@gmail.comకి తెలపాలని, లేదంటే తిరస్కరిస్తామన్నారు.